క్లుప్తంగా

అన్నెం వరలక్ష్మికి ఎమ్మెల్సీ తోట పరామర్శ

కపిలేశ్వరపురం: ఉదర సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటున్న పడమర ఖండ్రికకు చెందిన అన్నెం వరలక్ష్మిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం ఆమె ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆమె భర్త నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీతానగరం సర్పంచ్ వరదలక్ష్మి, ఉప సర్పంచ్ ఉరదా చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు వంగా నల్లశ్రీను, కుక్కల రాంబాబు, యర్రా వీరన్నబాబు ఉన్నారు.

గంజాయి కలిగిన ఐదుగురు అరెస్ట్

రామచంద్రపురం రూరల్: గంజాయి కలిగి ఉన్న రామచంద్రపురం, మండపేట, పసలపూడి గ్రామాలకు చెందిన ఐదుగురు యువకులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కాకినాడ రోడ్డులోని కబేళా వద్ద యువకులను పట్టుకుని వారి నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచామని ఎస్‌ఐ చెప్పారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి వేడుకలు



విద్యార్థులకు కంప్యూటర్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

మండపేట: లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి బ్రెయిలీ అని కొనియాడారు. బీఏ ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్న తేజ, బాలకృష్ణ, హరికృష్ణ, చంద్రికలకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఆయన కుటుంబ సభ్యులు కంప్యూటర్లను అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనందరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయిని మృతి



ఏవీ లత(ఫైల్)

రాయవరం: మండలంలోని పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న ఏవీ లత బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయినిగా లత విధులు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త గతంలోనే మృతి చెందారు. ఉపాధ్యాయిని ఆకస్మిక మృతిపై ప్రధానోపాధ్యాయుడు ఎం.అంబేడ్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి తమ సంతాపాన్ని తెలియజేశారు.

వాహనదారులకు భయం.. భయం..



ఆర్యావటం కూరాడ డ్రెయిన్‌పై రక్షణ గోడలు విరిగిపోయిన వంతెన

కాజులూరు: ఆర్యావటంలో ముత్తావారిగరువు వద్ద కూరాడ డ్రెయిన్‌పై 20 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ప్రధానంగా వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు విరిగిపోయి అప్రోచ్‌లు కరిగిపోయి ఉన్నాయి. ద్విచక్ర వాహనాలే కాకుండా పాదచారులు సైతం తప్పనిసరి పరిస్థితుల్లో భయం భయంగా వంతెనపై నుంచి ప్రయాణాలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి వంతెన పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్రాంతి ఆటల పోటీలను విజయవంతం చేయండి

కాజులూరు: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో జరగనున్న సంక్రాంతి ఆటల పోటీలను క్రీడాకారులు, ప్రజలు విజయవంతం చేయాలని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ఎస్.తులసీరామ్ కోరుతున్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్ర, శనివారాల్లో గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో మండల స్థాయి థగ్ ఆఫ్ వార్, వాలీబాల్ పోటీలు, శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వారి గ్రామాల్లోని మహిళా పోలీసులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

తాపేశ్వరం పాఠశాలలో సీబీఎస్ఈ

- రామచంద్రపురం డివిజన్‌లో ఎంపికైన ఏకైక హైస్కూల్
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- 9వ తరగతి నుంచి సీబీఎస్ఈలో బోధన



తాపేశ్వరంలోని పోలిశెట్టి సత్తిరాజు, శ్రీమతి భూషణం జెడ్పీ ఉన్నత పాఠశాల

మండపేట: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసిన తాపేశ్వరంలోని పోలిశెట్టి సత్తిరాజు, శ్రీమతి భూషణం జెడ్పీ ఉన్నత పాఠశాల మరో మైలురాయిని చేరుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)కు రామచంద్రపురం డివిజన్ నుంచి ఎంపికైన ఏకైక స్కూల్‌గా గుర్తింపు పొందింది. వచ్చే విద్యా సంవత్సరంలో 9వ తరగతి నుంచి సీబీఎస్ఈలో బోధన ప్రారంభం కానుంది.

మడత కాజా తయారీ ద్వారా గ్రామానికి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారు సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు. తాను చదువుకున్న జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో 2017లో కోటి రూపాయలకు పైగా తన సొంత సొమ్ము వెచ్చించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారు. 14 తరగతి గదులు నిర్మించి వాటిలో సీసీ కెమెరాలు, సీలింగ్ ఫ్యాన్లు, డిజిటల్ తరగతుల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు కల్పించారు. అధునాతనమైన రెండు డైనింగ్ హాల్స్, మూడు టాయిలెట్స్, మినరల్ వాటర్ ప్లాంట్, కిచెన్, స్టోర్ కిచెన్, కళావేదిక నిర్మాణంతో పాటు మరెన్నో వసతులు కల్పించారు. ఈ పాఠశాలలో 680కు పైగా విద్యార్థులుండగా వారిని ప్రోత్సహించేందుకు ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. ఏటా పాఠశాల నుంచి ఇద్దరు ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికవుతుండటం గమనార్హం. అత్యుత్తమ వసతులకు గాను ఇప్పటికే ఈ పాఠశాలకు జాతీయ స్థాయిలో స్వచ్ఛ విద్యాలయం పురస్కారం దక్కింది. ఇటీవల రూ.12 లక్షల వ్యయంతో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

డివిజన్‌లో ఏకైక ఉన్నత పాఠశాల

సీబీఎస్ఈ బోధనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 12 పాఠశాలలు ఎంపిక కాగా వాటిలో ఏడు గురుకుల పాఠశాలలు, ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. నాలుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలు అమలాపురం డివిజన్‌లో ఉండగా రామచంద్రపురం డివిజన్ నుంచి తాపేశ్వరం హైస్కూల్ ఒక్కటే సీబీఎస్ఈకి అర్హత సాధించింది. పాఠశాలలో మల్లిబాబు కల్పించిన వసతులు సీబీఎస్ఈ ఎంపికకు దోహదం చేశాయని ఉపాధ్యాయులు, స్థానికులు చెబుతున్నారు. సీబీఎస్ఈ విధానంలో బోధన ద్వారా ఐఐటీ, ఎన్ఎస్ఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షల్లో జాతీయ స్థాయిలో మరింత సత్తా చాటేందుకు వీలు కలుగుతుంది. 2023–24 విద్యాసంవత్సరంలో 9వ తరగతి నుంచి సీబీఎస్ఈ బోధన ప్రారంభించనున్నారు. అందు కోసం ఇప్పటికే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుణ్ణం వీరన్న, ఉపాధ్యాయుడు మద్దాల నాగేంద్ర కుమార్‌లకు రాజమహేంద్రవరంలో శిక్షణ ఇచ్చారు.

చాలా ఆనందంగా ఉంది



మా పాఠశాల సీబీఎస్ఈకి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. ఇక్కడి విద్యార్థులు జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో సత్తా చాటేందుకు ఇది ఎంతో దోహదపడుతుంది. సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయిలో రాణించాలి.

– పోలిశెట్టి మల్లిబాబు, సురుచి ఫుడ్స్ అధినేత, తాపేశ్వరం

విద్యావిధానంలో మార్పులు



సీబీఎస్ఈ ద్వారా విద్యా విధానంలో మార్పులు వస్తాయి. యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ఉంటుంది. ప్రాజెక్ట్ వర్క్‌లు పెరుగుతాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి 9వ తరగతి బోధన మొదలవుతుంది. ఇప్పటికే నాతో పాటు ఉపాధ్యాయులు శిక్షణ తీసుకున్నారు.

– గుణ్ణం వీరన్న, ప్రధానోపాధ్యాయుడు

భూహక్కు పథకంతో రైతులకు ఎంతో మేలు



కుందూరులో భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన శాశ్వత భూహక్కు పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. మండల పరిధిలోని కుందూరులో బుధవారం భూ యజమానులకు శాశ్వత భూ హక్కు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి వేణు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారం కాని భూసమస్యలను పరిష్కరించి శాశ్వత భూహక్కు పత్రాలను అందించడమే జగనన్న సమగ్ర భూహక్కు పథకం లక్ష్యమన్నారు. ఇప్పటికే మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, త్వరలోనే అన్ని గ్రామాల్లో ఈ పథకం ద్వారా పత్రాలు పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పంపన సత్యానందం, ఆర్డీఓ సింధూ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, బత్తుల విజయకుమారి, ఓబులనేని రాజ్‌కుమార్, తహసీల్దార్ వైద్యనాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా, పింఛన్ ఒకేసారి అందజేత

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామకు చెందిన చిక్కాల సూర్యకుమారి భర్త రాంబాబు గత జులైలో ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో వలంటీరు దమరసింగ్ కనకమహాలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ గంజా లోవప్రసాద్‌లు బీమా, పింఛన్ దరఖాస్తు ప్రక్రియలను పూర్తి చేశారు. దీనితో కొత్త సంవత్సరంలో సూర్యకుమారికి ప్రభుత్వం నుంచి రూ.లక్ష బీమా, నూతన పింఛన్ రూ.2,750 మంజూరయ్యాయి. వీటిని స్థానిక ప్రజాప్రతినిధులు వైఎస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతి, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషాల సమక్షంలో మంత్రి వేణు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో తక్కువ సమయంలోనే బీమా రావడం, పింఛన్ మంజూరు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాతపూడి ప్రసన్న విజయకుమార్, ఎంపీపీ అంబటి భవాని, వైఎస్ ఎంపీపీ శాకా బాబీ తదితరులు పాల్గొన్నారు.



చిక్కాల సూర్యకుమారికి బీమా చెక్కు, నూతన పింఛన్ అందజేస్తున్న మంత్రి వేణు

రాష్ట్రంలో చారిత్రాత్మక పాలన



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- లబ్ధిదారులకు కొత్త పింఛన్ల పంపిణీ

మండపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చారిత్రాత్మక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట పట్టణం, మండలానికి నూతనంగా మంజూరైన 549 పింఛన్లను బుధవారం ఎమ్మెల్సీ తోట లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక విజయ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చే నాటికి రూ.2,000 ఉన్న పింఛన్‌ను వెంటనే రూ.2,250లకు పెంచిన సీఎం జగన్ గత ఏడాది జనవరి నుంచి రూ. 2,500లకు, ఈ జనవరి నుంచి రూ.2,750లకు పెంచారన్నారు. పింఛన్‌సాయం పెంపు ఇక్కడితో ఆగదని మాట ఇచ్చినట్టుగా రాబోయే రోజుల్లో రూ.3000లు వరకు పెంచుతారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో పెద్ద ఎత్తున సామాజిక పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ రంపచోడవరం అబ్జర్వర్ కర్రి పాపారాయుడు, పార్టీ రాష్ట్రనేతలు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్లు గ్రంధి శ్రీనివాస్, మలసాని సీతామహాలక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి వల్లూరి రామకృష్ణ, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, పిల్లా అరవరాజు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వ భావనే ప్రభుత్వ బలం

కపిలేశ్వరపురం: కుల, మత ప్రాంతాలకు అతీతంగా సమానత్వమే కొలమానంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనను సాగిస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని పడమర ఖండ్రికలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించారు. టీకి దామ్ నుంచి పర్యటనను ప్రారంభించిన ఎమ్మెల్సీ తోటకు గ్రామ మహిళలు పూలతో స్వాగతం పలికి హారతి పట్టారు. తమ పింఛన్ డబ్బులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2,750కి పెంచిన ఆనందంలో మహిళలు, వృద్ధులు ఎమ్మెల్సీ తోటను తమ ఇళ్ళల్లోకి ఆహ్వానించి దీవించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన తోటను దళితపేట వాసులు పూల కిరీటంతో అలంకరించి ఘనంగా సత్కరించారు. పలు సాంకేతిక సమస్యలను ప్రస్తావించగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్సీ తోట ఆదేశించారు.



పడమర ఖండ్రిక గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన వారిలో అన్ని పార్టీల వారు ఉన్నారన్న విషయాన్ని గుర్తించుకోవాలని, పార్టీలకతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను సాగిస్తున్నారనడానికి అదే తార్కాణమన్నారు. శెట్టిబలిజ పేటలో స్థానికుల విజ్ఞప్తి మేరకు సీసీ రహదారి నిర్మాణానికై రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఎవరికి ఎలాంటి సమస్య తలెత్తినా తనను సంప్రదించవచ్చని ఎమ్మెల్సీ తోట ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు కవల శ్రీను, మాజీ సర్పంచ్ వంగా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు, పాలింగి శ్రీనివాస్, కుక్కల రాంబాబు, నేల సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రికకు చెందిన పలువురు ముస్లిం సోదరులు షేక్ మీరా, షేక్ హుస్సేన్, షేక్ మహబూబ్, షేక్ బబూల్, షేక్ పెద్ద హుస్సేన్ తదితరులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, మాజీ సర్పంచ్ వంగా శ్రీనివాస్, నాయకులు కవల శ్రీనివాస్, తిరునాతి వెంకటేశ్వరరావు ఉన్నారు. అంగర గ్రామానికి చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులు గంద్రోతుల పట్టాభి, కూనపురెడ్డి మురళి, సంకాబత్తుల పండు, యర్రా నాని తదితరులు మంగళవారం రాత్రి ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.



పడమర ఖండ్రికలో పార్టీలో చేరినవారితో ఎమ్మెల్సీ తోట

జాబ్‌మేళాలో 52 మందికి ఉద్యోగాలు

మండపేట: వికాస, స్థానిక ఏవీఆర్‌పీవీఆర్ (విద్యా వికాస్) కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్‌మేళాలో 52 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్, ఏసీ మ్యానుఫ్యాక్చరింగ్, టైర్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 136 మంది అభ్యర్థులు హాజరు కాగా వారిలో 52 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్టు వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు. యువత నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా అనేక అవకాశాలు పొందొచ్చన్నారు. స్థానికంగా అవకాశాలు తక్కువగా ఉన్నా పలు కంపెనీలతో మాట్లాడి అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ బండారపు శకుంతల, ప్రిన్సిపాల్ కె.అప్పారావు, హెచ్ఆర్‌లు హర్షద్, వేణు, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళాలో అభ్యర్థులకు సూచనలిస్తున్న దృశ్యం

సామాన్యులకు అధునాతన విద్య

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంపన్నులతో సమానంగా సామాన్యులకు అధునాతన విద్య అందుతుందని వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు అన్నారు. మండలంలోని గొల్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం 102 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసురాజు మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబురావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు జొన్నకూటి పద్మజ తదితరులు పాల్గొన్నారు.



గొల్లపాలెంలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఏసురాజు తదితరులు

‘అనుమతులు రద్దు చేయాలి’

కె.గంగవరం: పాతకోటలో ఇసుక ర్యాంపుకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలంటూ స్థానిక మత్స్యకారులు బుధవారం గోదావరిలో వినూత్న నిరసన వ్యక్తం చేశారు. పడవలలో గోదావరి మధ్యలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఇసుక ర్యాంపు నిర్వాహణ వల్ల మత్స్యకారులకు ఇబ్బందికరంగా ఉందని, దాని వల్ల కొత్తగా నిర్మిస్తున్న రైల్వే వంతెనకు కూడా ప్రమాదమని వారు ఆవేదన వ్యక్తం చేశారు

తిరుపతి వెళ్లి పింఛన్ సాయం పంపిణీ

మండపేట: ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు చేరవేయాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా తిరుపతి వెళ్లి పింఛన్ సాయం అందజేసి ఔదార్యం చాటుకున్నాడు మండలంలోని అర్తమూరుకు చెందిన వలంటీర్ సీహెచ్ కల్యాణ్. గ్రామానికి చెందిన కె. శ్రీకాంత్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి నూతనంగా కిడ్నీ పింఛన్ మంజూరు కాగా వచ్చే వీలులేకపోవడంతో స్విమ్స్ కార్యాలయ స్టాఫ్ ఎం.అరుణ్‌కుమార్‌రెడ్డి అర్తమూరు సచివాలయం స్టాఫ్, వలంటీర్ కల్యాణ్ దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన కల్యాణ్ మంగళవారం తిరుపతి బయలుదేరి వెళ్లారు. బుధవారం లబ్ధిదారునికి సాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, ఎంపీడీఓ ఐ.రాజు, వెల్ఫేర్ సెక్రటరీ సులేమన్ తదితరులు వలంటీర్ కల్యాణ్ సేవలను అభినందించారు.



తిరుపతి స్విమ్స్‌లో లబ్ధిదారునికి సాయం అందజేస్తున్న వలంటీర్ కల్యాణ్

మారు మోగిన నినాదాలు



రామచంద్రపురం పట్టణంలోని శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో బుధవారం పింఛన్ వారోత్సవాల కార్యక్రమం జరిగింది. పింఛన్లను మరోమారు పెంచినందుకు కృతజ్ఞతగా లబ్ధిదారులంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో ఉన్న ప్లకార్డులు చూపిస్తూ ‘జై జగన్, వర్ధిల్లు జగనన్న’ అంటూ నినాదాలు తెలియజేశారు. - రామచంద్రపురం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెట్రాజ్ పోటీలు

రామచంద్రపురం: పట్టణంలోని శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో బుధవారం సెట్రాజ్ ఆధ్వర్యంలో యువజనోత్సవాల్లో భాగంగా వివిధ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వనుము సోమశేఖరరావు నేతృత్వంలో పాటలు, వక్తృత్వం, క్విజ్, వ్యాసరచన, క్రీడా పోటీలైన వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జడ్జీలుగా కళాశాల అధ్యాపకులు వ్యవహరించారు. కార్యక్రమంలో సెట్రాజ్ మేనేజర్ కేఎస్‌వీ కాశీ విశ్వేశ్వరరావు, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీవీ సూర్యనారాయణ, ఫీల్డ్ ఆఫీసర్ గౌతమ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.



కృత్తివెంటి పేర్రాజు పంతులు కళాశాలలో నిర్వహించిన పాటల పోటీల్లో విద్యార్థులు

ఫీటు కాదు..సా‘పాటు’ కోసం



మీరు చూస్తున్నది సాహస ఫీట్లు కాదు. ట్రాక్టర్ డ్రైవర్ తన జీవనం కోసం చేస్తున్న వృత్తిలో భాగం మాత్రమే. మండలంలోని లొల్లలో పంట చేను దమ్ము చేస్తున్న సమయంలో ట్రాక్టర్ దిగబడుతుండగా ముందు చక్రాలు గాల్లోకి లేచిన దృశ్యమిది. ఏ మాత్రం బ్యాలెన్స్ తప్పినా ప్రాణానికే ప్రమాదమని తెలిపే సజీవ చిత్రమిది. రాయవరం